



## అనుభవాలు జ్ఞాపకాలు



వరాది సింహాచలం దగ్గర ఒక పల్లెటూరు. ఏదో వానాకాలం చదువు వెలిగించి ఖాళీగా కూర్చోవడ మెందుకని కుట్టు నేర్చుకుంటున్నాను. అప్పట్లో ఒక సోషల్‌సర్వీసువాళ్ళు సింహాచలంలో ఒక నెల రోజుల కేంపు ఏర్పాటుచేశారు. దానికి అన్ని జిల్లాల సమితులనుంచి ఆడమగ సభ్యులు వచ్చారు. దానికి సభ్యులు తక్కువగా వున్నారని మావూరి పెద్దాయన ఒకరు వచ్చి మా కుట్టుకేంద్రంనుంచి ఓ పది మందిని తీసుకెళ్ళారు. అంతవరకు మరో క్రొత్త ప్రదేశం ఎరగనివాళ్ళమేమో మా సంతోషానికి పగ్గాలు లేవు. ఇక సింహాచలంలో గడిపిన ఆ నెలరోజులు ఒక మధురానుభూతిగా, జీవితంలో మరువలేనంతగా ముద్ర వేసుకున్నాయి. మేం వెళ్ళింది జనవరి నెలలోకాబట్టి అక్కడ 8 గంటలయినా మంచు తెగ కురిసేది. కొండలన్నీ పొగమంచుతో కప్పబడి అక్కడక్కడ వెలుతురుపడి బాలభాస్కరుని కిరణాలకు హిమాలయ పర్వతాల్లాగ మెరిసిపోతుండేవి. కొండ మీదకు పోయే బస్సు మధ్య మధ్య మాయమైపోతూ ఒకో రోడ్డుమీద కనబడుతూ మినుకు మినుకు మంటున్న నక్షత్రాలను జ్ఞప్తికి తెచ్చేది. రాత్రి తెచ్చి నిలవచేసిన నీరు అంత చలిలోనూ ఉదయం నాలుగు గంటలకే స్నానం ముగించేసుకునే వాళ్ళం. అదే ఇంటి దగ్గర అయితే ఎనిమిది అయినా బద్ధకించేవాళ్ళం. రంచనుగా అందరమూ ఆరు గంటలకే రెడీ అయి డ్రిల్లుకు హాజరయేవాళ్ళం. తరువాత కాఫీ టిఫిను. పదినుంచి 12 వరకు ప్రముఖుల వుపన్యాసాలుగాని, పాఠములుగాని చెప్పేవారు. నోట్సు వ్రాయించేవారు. మధ్యాహ్నం భోజనం. మూడునుంచి శ్రమదానం. ఆ చుట్టుప్రక్కల ఒకరోడ్డు కూడా వేశాంలెండి. సాయంత్రము టీ. 6నుంచి 8వరకు పాఠములుచెప్పేవారు. ఆ నెలరోజులలో ఎన్నో విషయములు నేర్చుకున్నాము. ఒకసారి వైజాగ్ తీసుకువెళ్ళి ఇళ్ళు అవీ అంటుకుంటే ఆర్పడమెలా అన్న విషయాన్ని చేసి చూపించారు. ఈ నెలలోనూ మేమందరమూ ఒక కుటుంబ సభ్యులలాగ కలిసిపోయాము. నెల పూర్తయినకొలది విడిపోవాలంటే మాకెంతో బాధనిపించేది. చివరిరోజున అందరం కలసి దైవ దర్శనము చేసుకున్నాము. ఒకరి అడ్రసు మరొకరం తీసుకున్నాము. కళ్ళనీళ్ళతో వీడ్కోలిచ్చుకుని ఎవరి బస్సు వాళ్ళ మెక్కాము. అప్పుడు మాకు సర్టిఫికేట్లు ఇచ్చారు. మా అందరిలోనూ ఎవరికెవరు ఎన్నాళ్ళు గుర్తున్నారో చెప్పలేను. ఇది జరిగి 14 ఏళ్ళయింది. జీవితంలో తీపివీ. చేదువీ ఎన్నో అనుభవాలు జరిగాయి. కానీ నాకు మాత్రము ఇవన్నీ నిన్న మొన్న జరిగినట్లు అనిపిస్తాయి. జనవరి నెలలోని మంచు తేమతో కూడిన చల్లగాలి శరీరానికి తగలగానే పాతస్మృతులన్నీ గుర్తుకొస్తాయి. తరువాత ఎన్నోసార్లు దైవదర్శనముచేసుకున్నా ఆ వేళటి అనుభూతి మరి రాలేదు. మనసులోపలి వరకూ స్పర్శించిన ఇటువంటి అనుభవాలు అందరికీ ఎప్పుడో ఒకప్పుడు జరిగే వుంటాయి! హాస్టల్ లైఫ్ అనుభవించే వాళ్లకుఇదేమీ గొప్పకాకపోవచ్చు. కాలేజీ హాస్టల్స్ అన్న పదాలే వినపడని ఆ పల్లెటూరి వాళ్ళం కనుక నా మనస్సు ఇంతగా స్పందించి వుంటుంది. ఆ సభ్యులలో ఏ ఒకరు ఇది చదువుకుని పాత రోజులు గుర్తుకు తెచ్చుకున్నా నేను ధన్యురాలిని.

